క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలో జాంపేట ఆజాద్ చౌక్ దగ్గర మార్గాని భరత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు హబీబుల్లా ఖాన్, పోలు విజయలక్ష్మి, సంకిస భవానీ ప్రియ, మజ్జి అప్పారావు, రేగుళ్ల నాని కార్యకర్తలు పాల్గొన్నారు.

దంత ఆరోగ్యంపై అవగాహన అవసరం



విద్యార్థులకు నీతికథలు చెబుతున్న సభ్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దంత శుభ్రతపై విద్యార్థులకు అవగాహన అవసరమని దంత వైద్య నిపుణుడు డాక్టర్ పవన్ సూచించారు. స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో యాపిల్ డెంటల్‌కేర్ వైద్యులు డా.పవన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. లేకపోతే బ్యాక్టీరియా చేరి పుచ్చిపోయే ప్రమాదం ఉందని సూచించారు. ముందుగా వేసవి శిక్షణ శిబిరం తరగతులలో పుస్తక పఠనం నీతి కథలు చెప్పడం, డ్రాయింగ్, సంగీతం భగవద్గీత తరగతులు నిర్వహించినట్టు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాసు, బొడ్డు శ్రీనివాసు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్

ప్రకాశం నగర్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్‌కోడ్‌లకు నిరసనగా ఈ నెల 20 చేపట్టనున్న జాతీయ సమ్మెకు సన్నాహక సమావేశాన్ని మంగళవారం స్థానిక ఆనం రోటరీ హాల్లో నిర్వహించారు. సమావేశానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు టి.మధు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వరావు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు జోజి, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎస్.కిరణ్ ముఖ్య అతిథులుగా హాజరై పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసేందుకు మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను మార్చివేసిందని పేర్కొన్నారు. 20న నిర్వహించే సమ్మెను గ్రామీణ ప్రాంతంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు జయప్రదం చేయాలని కోరారు.

రూ. కోట్లలో కుట్టుశిక్షణ స్కామ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారావు

కోరుకొండ: కుట్టు శిక్షణ, మెషీన్ల పంపిణీ ద్వారా రూ.167 కోట్లు కుంభకోణానికి కూటమి ప్రభుత్వం తెరలేపిందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కొండపల్లి దుర్గారావు ఆరోపించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ మహిళలకు కుట్టు శిక్షణ పేరుతో రూ.257 కోట్లు కాంట్రాక్ట్ ఇచ్చారని, ఈ పథకంలో మెషీన్ కొనుగోలుకు రు.4,300, శిక్షణకు కాంట్రాక్టర్ అవుట్‌సోర్స్‌కు ఇచ్చింది రూ.3 వేలు, లబ్ధిదారుకు శిక్షణకు అయ్యే ఖర్చు రూ.7,300 మొత్తం లక్ష మంది లబ్ధిదారులకు అయ్యే వ్యయం రూ.73 కోట్లు అయితే టెండర్ విలువ రూ.230 కోట్లుంది. ఇందులో రూ.167 కోట్లు స్కామ్ జరుగుతోందన్నారు. సమావేశంలో రాజానగరం జెడ్పీటీసీ వాసంశెట్టి పెద్ద వెంకన్న బీసీ నాయకులు పాల్గొన్నారు.

పేదింట్లో ఉడకని పప్పులు



- చౌక దుకాణాల్లో కందిపప్పు కరవు
- బహిరంగ మార్కెట్‌లో ధర రూ.170
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు

రాజమహేంద్రవరం రూరల్: నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కనీసం బియ్యంతో పాటు పౌరసరఫరాల శాఖ కందిపప్పు కూడా పంపిణీ చేయకపోవడంతో నాలుగు నెలలుగా పేదింట్లో కందిపప్పు ఉడికించలేని దుస్థితిలో ఉన్నామని వినియోగదారులు వాపోతున్నారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో 1,53,000 రేషన్ కార్డులు ఉండగా ఒక్కరికి కూడా కందిపప్పు పంపిణీ జరగలేదు. మూడు నెలలుగా రూరల్ మండలంలో పదిశాతం లబ్ధిదారులకు కందిపప్పు పంపిణీ చేశారు. ఈ నెల ఆ పదిశాతం మందికి కూడా పంపిణీ చేయలేదు. కూటమి ప్రభుత్వం రేషన్ సరుకుల్లో కోత విధిస్తూ పేద, మధ్య తరగతి ప్రజలపై అదనపు భారం పెంచుతోంది. మార్కెట్‌లో కందిపప్పు ధర ఆకాశాన్ని అంటుతోంది. ప్రాంతాన్ని బట్టి కిలో రూ.160 నుంచి రూ.170 వరకూ విక్రయిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిల్లో తెల్లరేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ఎండీయూ వాహనాల్లో కందిపప్పును ఇవ్వకపోవడంతో శోచనీయం. కిలో కందిపప్పు రూ.67 చొప్పున తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారునికి అందజేయాల్సి ఉంది. కానీ ముందుగా రేషన్ తీసుకున్న వారికి మాత్రమే కందిపప్పు అందుతుందని కార్డుదారులు చెప్తున్నారు. బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు ఇస్తామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా హామీ ప్రకటించింది. కానీ అధికారంలోకి వచ్చాక అరకొరగా పంపిణీ చేస్తున్నట్లు లబ్ధిదారులు చెప్తున్నారు. కందిపప్పు కోసం మండలాల నుంచి ఇండెంట్ పెట్టినప్పటికీ ప్రభుత్వం నుంచి రాకపోవడంతో బియ్యం, పంచదారతోనే రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనదారులు సరిపెడుతున్నారు.



ఎండీయూ వాహనం ద్వారా రేషన్ ఇస్తున్న సిబ్బంది

పేదలపై చిన్నచూపు



పేదలకు, తెల్ల రేషన్‌కార్డుదారులకు ఇచ్చే కందిపప్పు కూడా ప్రభుత్వం సరిగ్గా ఇవ్వకుండా చిన్నచూపు చూస్తోంది. ఈ నెల ఒక్కరికి కూడా కందిపప్పు అందలేదు. ప్రతి తెల్ల రేషన్‌కార్డు దారుడుకి కందిపప్పు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– గాదె అనురాధ, ఎ–బ్లాకు, శాటిలైట్ సిటీ

కందిపప్పు ఇచ్చేది ఎప్పుడో



గత ప్రభుత్వంలో బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇవ్వడం లేదు. ఒక పక్క బయట మార్కెట్‌లో నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రభుత్వం అందరికీ కందిపప్పు ఇచ్చే ఏర్పాటు చేయాలి.

– అంగాడి సత్యప్రియ, అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం, రాజమండ్రి రూరల్

ఖైదీలకు న్యాయ సహకారానికి కృషి

జడ్జి శ్రీలక్ష్మి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక మహిళా ప్రత్యేక కారాగారంలోని ఖైదీలకు న్యాయ సహకారం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తోందని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి తెలిపారు. మహిళా ప్రత్యేక కారాగారాన్ని మంగళవారం ఆమె సందర్శించి ఆహారం ప్రమాణాలు, సదుపాయాల కల్పన తదితర అంశాలను పరిశీలించారు. ఖైదీలతో స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకొన్నారు.

ఖైదీలు తరపున వాదించేందుకు న్యాయవాదులు కావాలన్నా, బెయిల్ పిటిషన్లు, హైకోర్టు అప్పీళ్ళు తదితర న్యాయ సహకారం పొందేందుకు సంస్థ సహకరిస్తోందన్నారు.పారా లీగల్ వలంటీర్ల ద్వారా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవచ్చన్నారు. మేడే వారోత్సవాల్లో భాగంగా కార్మిక శాఖ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆనాల వెంకట అప్పారావు రోడ్డు వద్దగల బ్లింకిట్ సంస్థ వర్కర్స్‌తో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ–శ్రమ్ కార్డుల రిజిస్ట్రేషన్ పద్ధతిపై అవగాహన కల్పించారు. జడ్జి శ్రీలక్ష్మి గౌతమి జీవ కారుణ్య సంఘం వృద్ధాశ్రమాన్ని సందర్శించారు.

ఈవీఎం ఎమ్మెల్యే సారథ్యంలో కబ్జా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్

- విచారణ జరపాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని డిమాండ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ఈవీఎం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కబ్జా ముఠా తయారైందని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈవీఎం ఎమ్మెల్యే ముఠా నగరంలో 1వ డివిజన్ లాలాచెరువులో రూ.10 కోట్ల విలువైన 1385 గజాల స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపించారు. విశాఖలో ఉండే ఓ మహిళ పేరిట దానిని రిజిస్టర్ చేశారని ఆయన తెలిపారు. పార్కుకు సంబంధించి రామాలయం స్థలంగా పిలవబడే ఈ భూమిలో పాతికేళ్లుగా శ్రీరామ నవమి ఉత్సవాలు చేస్తున్నారన్నారు. ఆ భూమిని కబ్జా చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని, దీనిపై పూర్తిస్థాయి విచారణ చేయాలని మార్గాని డిమాండ్ చేశారు. నాలుగు రోడ్ల బిట్‌గా ఉండే ఈస్థలంలోనే ఎన్నికల ముందు కూడా గౌడ శెట్టిబలిజ సంఘ సమావేశం జరిగిందని, ఈ కబ్జాపై సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తాను తలపెట్టిన మోరంపూడి ఫ్లైఓవర్ త్రికరణ శుద్ధితో పూర్తయిందని, నా సొంత స్థలంలో ఉచితంగా కార్ఖానా ఏర్పాటు చేసుకోడానికి అనుమతించి, ఫ్లైఓవర్ వేగంగా పూర్తి కావడానికి కృషి చేశానన్నారు. అదే కాంట్రాక్టర్ ఇప్పుడు జొన్నాడ దగ్గర కడుతున్నాడని, అక్కడ ఇంకా స్తంభాలు కూడా కట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత కనీసం సర్వీస్ రోడ్లు కూడా వేయలేకపోయారని ధ్వజమెత్తారు. ఈవిషయంలో ఎంపీ పురందేశ్వరి బాధ్యత తీసుకోవాలన్నారు. ఫ్లైఓవర్ పైన ఎందుకు లైట్లు వేయడం లేదన్నారు. ఫ్లైఓవర్‌కు అటుపక్క ఇటుపక్క ఈవీఎం ఎమ్మెల్యే ఫ్లెక్సీలు కట్టుకోవడం తప్ప ఏమీలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్వారీ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి

కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: క్వారీ గోతులలో పడి తరచుగా మనుషులు, పశువులు ప్రాణాలు కోల్పోతున్నందున ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. మంగళవారం నగరంలోని 49వ డివిజనున్‌లో వున్న సున్నం బట్టి లే ఔట్ వద్ద క్వారీ గోతులను ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వారీ మొత్తాన్ని డ్రోన్ ద్వారా గోతుల విస్తీర్ణం, లోతు తదితరాలపై పూర్తి స్థాయి సర్వే చేయాలని ఆదేశించారు. ప్రజలు, జంతువులు తరచూ గోతులలో పడటానికి అవకాశమున్న ప్రమాదకరమైన పాయింట్లను గుర్తించి మార్కు చేయాలన్నారు. డ్రోన్ సర్వే మాత్రమే కాక గోతులను పూర్తిగా పరిశీలించాలన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలతో క్వారీ గోతులను నింపటానికి తగిన చర్యలను తీసుకోవాలని, గోతుల చుట్టూ రోడ్డు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయటానికి అంచనాలను తయారు చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. దీనిపై సమగ్ర నివేదిక తయారు చేసి కలెక్టరుకు సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఈఈ మదర్సా ఆలీ, 3వ పట్టణ సీఐ అప్పారావు, ఆర్ అండ్ బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, నగరపాలక సంస్థ టీపీబీఓలు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అసిస్టెంటు ఇంజినీర్ తదితరులు పాల్గొన్నారు.



క్వారీ గోతులను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ప్రకాశం నగర్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య పిలుపునిచ్చారు. పాత తుంగపాడులో ఇటీవల జరిగిన అంతర్రాష్ట్ర కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ కప్–25 టోర్నీలో పతకాలు సాధించిన క్రీడాకారులను డీఎస్పీ తన కార్యాలయంలో అభినందించారు. కాటస్, కుమిటే విభాగంలో మోక్షత్, కె.లావణ్య, రమ్య, దీక్షిత, పి.సహస్ర రేఖ, పి.నవ్య సూర్య తేజస్వి, ఎస్.శ్రీ సహస్ర, వి.యశ్విని, బి.ఉషాందిని, బి.అంజలి, బి.అక్షర, ఎ.ప్రసన్న పి.పూజ, జి.యశస్వి, జి.ధనస్వి, సీహెచ్ కోవింద్, జి.జస్వంత్, జె.శశి వర్ధన్, డి.భువనేశ్, పి.అకిరా నందన్, టి.సంతోష్, వి.కుశల్ శివ, ఎ.ప్రవీణ్, టి.శ్రీ గణేష్, ఎ.వికాస్ నారాయణ, ఎ.హర్ష వర్ధన్ సాయి, ఎన్.శరత్ శ్రీ వంశీ, జె.శేషంత్‌లు బంగారు, వెండి పతకాలు కైవసం చేసుకున్నారు. ప్రథమ బహుమతిని ఎన్.శ్రీ లక్ష్మి లత గోల్డ్ మెడల్‌తో పాటు ట్రోఫీ, ద్వితీయ బహుమతిని కే.లక్ష్మిభవాని సిల్వర్ మెడల్‌తో పాటు ట్రోఫీని గెలుచుకున్నారు. బాలురు విభాగంలో పి.వెంకట చరణ్ ప్రథమ బహుమతి గోల్డ్ మెడల్‌తో పాటు ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్న జట్టును డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో మాస్టర్ పిల్లి అరుణ్ కుమార్, కోచ్ పైడిమళ్ల సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు లబ్ధి చేకూరేలా కార్యాచరణ

- నిర్కా డైరెక్టర్ డాక్టర్ మాగంటి
- కేవీకే శాస్త్రీయ సలహా సంఘ సమావేశం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లాలోని నిర్దిష్ట సమస్యలను గుర్తించి రైతులకు లబ్ధి చేకూరేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని జాతీయ వాణిజ్య పరిశోధన సంస్థ (నిర్కా) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ సూచించారు. మంగళవారం స్థానిక రాజమహేంద్రవరం ఐసీఏఆర్ – జాతీయ వాణిజ్య పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రీయ సలహా సంఘం సమావేశం ఆయన అధ్యక్షతన నిర్కాలో జరిగింది. ప్రతి సబ్జెక్టు మేటర్ స్పెషలిస్టు జిల్లాలోని కేవీకే పరిధిలోని మండలాలకు చెందిన వ్యవసాయ, ఉద్యాన రంగాల సమాచారాన్ని బెంచ్ మార్కు సర్వేగా పరిగణించాలని, సహజ వనరుల ఉప లబ్ధి తదితర అంశాలను మ్యాపింగ్ చేసుకుని అత్యంత అవశ్యకమైన అంశాలను గుర్తించాలన్నారు. కేవీకే పరిధిలోని 52 మండలాలకు చెందిన వనరులను దృష్టిలో పెట్టుకుని కార్యక్రమాలను రూపొందించుకోవాలని తెలిపారు. మార్టేరు ప్రాంతీయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ కేవీకే మార్టేరు పరిశోధన సంస్థ, ఏరువాక కేంద్రాలు సమన్వయంగా వ్యవసాయ ప్రదర్శనలు క్షేత్రస్థాయి ప్రదర్శనలు, చిరు సంచుల ప్రదర్శనలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ ఐసీఏఆర్–భారత వరిపరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.ముత్తురామన్, కలవచర్ల కేవీకే హెడ్ డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు, జేవీఆర్ సత్యవాణి తదితరులు వారు చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. శాస్త్రీయ సలహా సంఘం సమావేశం సందర్భంగా రైతు ప్రయోజనార్థం లిల్లీ తోటల్లో నులిపురుగు నివారణ సమగ్ర యాజమాన్యం, పసుపులో దుంపకుళ్లు సమగ్ర యాజమాన్యం అనే రెండు కరపత్రాలను గౌరవ అతిథుల ద్వారా విడుదల చేశారు. సమావేశంలో వివిధ సంస్థల ప్రధాన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ మాగంటి శేషుమాధవ్ తదితరులు

జీఓ 77ను రద్దు చేయాలి



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఏబీవీపీ సభ్యులు

కంబాలచెరువు: పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ 77ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వై.జంక్షన్ వద్ద అర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విభాగ్ కన్వీనర్ సత్య మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో మంత్రి లోకేష్ ఇచ్చిన మాటలను గాలికి వదిలేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జీఓ 77ను రద్దు చేయాలని లేకపోతే ఐసెట్ పరీక్షను రాష్ట్ర వ్యాప్తంగా అడ్డుకుంటామన్నారు. అలాగే మంత్రి లోకేష్ రాష్ట్రంలో ఎక్కడ పర్యటించినా అడ్డుకుంటామని హెచ్చరించారు.

ప్రణాళికతో ఉన్నత స్థానాలకు చేరాలి

- విద్యార్థులకు నన్నయ వీసీ ప్రసన్నశ్రీ హితవు
- ఘనంగా ఆర్ట్స్ కళాశాల పీజీ గ్రాడ్యుయేషన్ డే

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని నన్నయ వర్సిటీ వీసీ డాక్టర్ ప్రసన్నశ్రీ అన్నారు. 2018–20 విద్యా సంవత్సరాల పీజీ గ్రాడ్యుయేషన్ డే ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. వీసీ ప్రసన్నశ్రీ, గుజరాత్ బీఎంటీయూ వర్సిటీ వీసీ మధుకర్ ఎస్.పృథ్వీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాలలో పీజీ చేసిన 14 గ్రూప్‌లకు చెందిన 480 పైగా విద్యార్థులకు పట్టాలను అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ విద్యార్థులంతా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే ధైర్యాన్ని, సవాళ్లను ఎదుర్కొనే దృఢమైన వైఖరిని పెంపొందించుకోవాలని సూచించారు. బీఎంటీయూ వీసీ పృథ్వీ మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారానే బంగారు భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ 1853లో స్థాపించబడిన ఈ కళాశాల విద్య, పరిశోధన, ప్రజా సేవా రంగాల్లో 170 ఏళ్లకు పైగా అద్భుత వారసత్వంతో విరాజిల్లుతోందన్నారు. కార్యక్రమంలో కళాశాల సీపీడీసీ కార్యదర్శి తుమ్మిడి రామ్‌కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ పి.బాబ్జి, అధ్యాపకులు పాల్గొన్నారు. కళాశాల నాలుగేళ్ల ప్రగతిని ప్రిన్సిపాల్ నివేదించారు.



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నన్నయ వీసీ డాక్టర్ ప్రసన్నశ్రీ

తల్లీకొడుకుల అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: తన నాలుగేళ్ల కుమారుడితో ఇంటి నుంచి వెళ్లిన తన భార్య ఇప్పటి వరకు తిరిగి రాలేదని కవలగొయ్యికి చెందిన వల్లు పృథ్వీరాజ్ మంగళవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం కవలగొయ్యి గ్రామానికి చెందిన వల్లు పృథ్వీరాజ్‌కు 27 ఏళ్ల భార్య వల్లు సత్యవతి, నాలుగేళ్ల కుమారుడు వల్లు ప్రభాస్ ఉన్నారు. ఏప్రిల్ 30వ తేదీన ఒక ప్రైవేటు స్కూల్లో ఉద్యోగానికి ఇంటర్వ్యూకు వెళ్లింది. అయితే ఆరోజు కాకుండా ఈ నెల ఒకటో తేదీన ఇంటికి వచ్చింది. దీంతో సత్యవతిని అతని భర్త పృథ్వీరాజ్ మందలించాడు. ఈ నెల ఐదో తేదీ ఉదయం ఉదయం 8.30 గంటల సమయంలో తన కుమారుడిని తీసుకుని ఆమె ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని పృథ్వీరాజ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




వల్లు సత్యవతి, ప్రభాస్ (ఫైల్)

వర్షాకాలానికి ముందస్తు చర్యలు తీసుకోండి

జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి

రాజమహేంద్రవరం రూరల్: రానున్న వర్షాకాలంలో ఇబ్బందులు, ఆరోగ్యసమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తపడాలని జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ముందస్తు ఏర్పాట్లపై, తాగునీటి సక్రమ సరఫరా, వర్షాల వల్ల వచ్చే విషజ్వరాలు, తాగునీటి కాలుష్యంతో వచ్చే డయేరియా తదితర వ్యాధుల నివారణకు తీసుకోవలసిన చర్యలపై ఆమె ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.వెంకటగిరి ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులతో వెబెక్స్ ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 8, 9, 10 తేదీల్లో అందరు పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోని మంచినీటి పైపులైన్లు క్షుణ్ణంగా తనిఖీచేసి అవసరమైన చోట మరమ్మతులు చేయాలన్నారు. గుర్తించిన పనులకు ఈ నెల 11వ తేదీ నుంచి గ్రామ పంచాయతీలో నిధులు మంజూరు చేసి నెలాఖరులోపు పనులు పూర్తిచేయాలని శాంతామణి ఆదేశించారు.

ఉపాధి పనులు ప్రారంభం

కడియం: జేగురుపాడు పంచాయతీలో ఉపాధి పనుల్లో భాగంగా బురద కాలువ పూడికతీత చేపట్టినట్టు ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు. ఈ పనులను టెక్నికల్ అసిస్టెంట్ పద్మ, ఇన్‌చార్జి ఫీల్డ్ అసిస్టెంట్ వీర బాబుల పర్యవేక్షణలో చేయిస్తున్నట్టు తెలిపారు. ఉపాధి హామీ పనులలో ఎటువంటి జాప్యం రానివ్వకుండా నిరంతరం చేస్తామన్నారు.

సినిమాలు



శ్యామల	జింఖానా
సూర్యమినీ	రైడ్–2
సూర్యప్యాలెస్	థండర్‌బోల్ట్స్
స్వామి	హిట్–3
శివజ్యోతి	హిట్–3
అనుశ్రీ	హిట్–3
రాజా	హిట్–3
ఊర్వశి	హిట్–3
మేనక	అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
రంభ	గుడ్‌బ్యాడ్‌అగ్లీ, అన్‌టిల్‌డాన్
కుమారి	సారంగపాణిజాతకం
అప్సర	రెట్రో
అశోక	రెట్రో
నామవరం	
వివిఎస్‌మహల్	హిట్–3
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	హిట్–3
కడియం	
వెంకటసూర్య	హిట్–3

బూరుగుపూడిలో పోలీసు పికెట్

కోరుకొండ: మండలంలోని బూరుగుపూడిలో మంగళవారం పోలీసు పికెట్, 144 సెక్షన్ విధించారు. సోమవారం రాత్రి దళితయువకుడి అరెస్టు, పోలీసులు దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణతో ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో పోలీసుల పట్ల దురుసుగా వ్యవహరించాడన్న కారణంతో స్థానిక చోడదాసి పాల్ ప్రాన్సిస్ (టింకూ)ను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. అలాగే గ్రామంలో ముందస్తు చర్యల్లో భాగంగా ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, ఐదుగురు ఎస్సైలతో పాటు, 50 మంది పోలీసులు పికెట్ నిర్వహిస్తున్నారు. ఈ ఘటనపై సీఐ సత్యకిశోర్ విలేకరులతో మాట్లాడారు. టింకూ, అతని అనుయాయులు సోమవారం రాత్రి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని, మద్యంషాపులో మద్యం సేవించారు. రోడ్డుపైకి వచ్చి అటుగా వస్తున్న సాలాపు చక్రవర్తి ట్రాక్టర్‌ను ఆపారు. డ్రైవర్ తెల్సినవాడు కావడంతో ఇంజన్ ఆపకుండానే తాళం తీసేయడంతో రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఎయిర్‌పోర్టు రోడ్డులో వాహనాలు నిలిచిపోవడంతో ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది నివారించడానికి వెళ్లారు. పోలీసుల పట్ల టింకూతో పాటు పలువురు దురుసుగా ప్రవరించారన్నారు. దీంతో సోమవారం రాత్రి నిందితుడిని అరెస్టు చేశామన్నారు. దీంతో రోడ్డుపై ఆందోళనకు దిగిన యువకులను చెదరగొట్టడానికి విస్తృతంగా పోలీసులను తీసుకువచ్చినట్టు తెలిపారు. గతంలో కొన్ని కేసుల్లో టింకూ ముద్దాయిగా ఉండటంతో ఈ ఘటనలో కేసు నమోదు చేసినట్టు తెలిపారు. టింకూ ప్రథమ నిందితుడని, అతనితో పాటు అరుణ్, ప్రవీణ్, బేదంపూడి చిట్టి, మరి కొందరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు.